సాక్షి
అనకాపల్లి
సోమవారం ׀ 9 ׀ డిసెంబర్ ׀ 2024



సంగీతం.. సాహసం..
సంగీతానికి సాహసాన్ని జోడించారు. తూర్పు నావికా దళం ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆకట్టుకుంది. 8లో



'కొండ'ంత విశ్వాసం
విశాఖనగరంలో కొండగుడి పండగ ప్రశాంతంగా జరిగింది. కులమతాలకతీతంగా భక్తులు పాల్గొన్నారు. 8లో



ఓవరాల్ చాంప్ ఎన్టీఆర్ జిల్లా
అంతర్ జిల్లాల స్విమ్మింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఎన్టీఆర్ జిల్లా సాధించగా విశాఖ జిల్లా రన్నరప్‌గా నిలిచింది. 8లో

ఉత్తరం రాయండి.. బహుమతి పొందండి



- ఢాయి అఖర్ పేరుతో తపాలాశాఖ పోటీలు
- ప్రతిభ చూపినవారికి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో బహుమతులు
- 14 వరకూ గడువు



లేఖ రచన పోటీలకు అనకాపల్లి డివిజన్ తపాలాశాఖ అధికారులు రూపొందించిన బ్యానర్

యలమంచిలి రూరల్: ఒకప్పుడు సమాచార బట్వాడాకు తపాలానే ఆధారం. ప్రియమైన వారి నుంచి వచ్చే ఉత్తరాల కోసం అంతా ఆశగా ఎదురు చూసేవారు.పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకోవడం నుంచి ఉద్యోగాల భర్తీ వరకూ లేఖలే కీలక పాత్ర పోషించేవి.సాంకేతికత పెరుగుతున్న నేపథ్యంలో ఆ పరిస్థితి మారిపోయింది.ఇప్పుడు ఎక్కువ సామాజిక మాధ్యమాలపై ఆధారపడుతున్నాం. సెల్‌ఫోన్‌ను ఉపయోగించి క్షేమ సమాచారం పంపుతున్నాం.కార్యాలయాలు,కంపెనీలు,వివిధ వ్యాపార సంస్థల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు మెయిళ్ల ద్వారా పంపిస్తున్నారు.గూగుల్ మీట్ ద్వారా సమావేశాలూ నిర్వహిస్తున్నారు.విద్యాలయాల్లోనైతే డిజిటలైజేషన్ విప్లవం వచ్చింది.విద్యార్థులకు ట్యాబులు ఇస్తున్నారు.ఆన్‌లైన్‌లోనూ తరగతులు కొనసాగుతున్నాయి. వాట్సప్,ఫేస్‌బుక్,ఎక్స్,ఇన్‌స్టాగామ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఆంగ్ల అక్షరాలతో సంక్షిప్త రాతలకు అలవాటు పడిన విద్యార్థులు,మాతృ భాషలో వ్యాసాలు గానీ లేఖలు గానీ రాయలేకపోతున్నారు.దీంతో పిల్లల చేతిరాత అధ్వానంగా ఉంటోంది. అందమైన దస్తూరీ అంతరించిపోతోంది.ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు,విద్యార్థుల చేతిరాతను మెరుగుపరిచేందుకు,వారికి లేఖా రచనను అలవాటు చేసేందుకు తపాలాశాఖ చర్యలు చేపట్టింది.ఒకప్పుడు ఉత్తరాల ద్వారా సమాచారం పంపే పద్ధతిని తపాలాశాఖ మళ్లీ తెరపైకి తెచ్చింది.వ్యాసాన్ని చేతిరాతతో రాసి తమకు పంపాలని 'ఢాయి అఖర్' పేరుతో సర్కిల్(రాష్ట్ర), జాతీయ స్థాయిల్లో పోటీలకు ఆహ్వానిస్తోంది.

రెండు విభాగాల్లో పోటీలు..బహుమతులు



పోస్టుబాక్స్

18 సంవత్సరాల లోపు,దాటిన వారు వేర్వేరు విభాగాల్లో పోటీల్లో పాల్గొని లేఖలు రాయవచ్చు.'ది జాయ్ ఆఫ్ రైటింగ్ ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్' అంశంపై లేఖ రాయాలి.హిందీ,ఇంగ్లిష్,తెలుగు,ఉర్దూ సహా ఏ భారతీయ భాషలోనైనా ఉత్తరం రాయవచ్చు. ఎన్వలప్ కవర్‌లో రాసేవారు ఎ-4 సైజు తెల్ల కాగితంపై వెయ్యి పదాలకు మించకుండా స్వదస్తూరీతో రాయాలి. ఇన్‌లాండ్ లెటర్‌లో అయితే 500 పదాలకు మించకూడదు. లేఖ కవరు పైనవయసు రాసి,అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం జత చేయాలి.లేఖపై 'ఢాయి అఖర్' అని రాసి అనకాపల్లి డివిజన్ ప్రధాన తపాలా కార్యాలయం చిరునామాకు ఈ నెల 14వ తేదీ లోపు పంపించాలి. ఉత్తరాల్లో ప్రతిభ చూపి ఎంపికైన వారికి సర్కిల్(రాష్ట్ర) స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ25వేలు,ద్వితీయ రూ10వేలు,తృతీయ రూ.5వేలు అందజేస్తారు.జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతికి రూ.50 వేలు, ద్వితీయ రూ.25వేలు,తృతీయ రూ.10 వేలు గెలుచుకునే అవకాశం ఉంది.

చేతి రాతతో పాటు నైపుణ్యం పెంచడమే లక్ష్యం



ఢాయి అఖర్ పేరుతో తపాలా శాఖ నిర్వహిస్తున్న లేఖా రచన పోటీలతో విద్యార్థులు,యువతలో చేతిరాత నైపుణ్యం మెరుగుపడుతుంది. సృజనాత్మకతను వెలికితీయవచ్చు.గతంలో మధురజ్ఞాపకంగా ఉండే ఉత్తరం ఈ తరానికి పరిచయం అవుతుంది.భాషాజ్ఞానం పెరుగుతుంది.ఇప్పటికే ఈ పోటీలకు సంబంధించి అనకాపల్లి డివిజన్ పరిధిలో విద్యాసంస్థలకు, తపాలాశాఖ సిబ్బంది ద్వారా అందజేశాం.తపాలాశాఖ లక్ష్యానికి అనుగుణంగా ఆసక్తి గలవారు ఈ పోటీల్లో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలి.
– సంజయ్ కుమార్ పాండా, అసిస్టెంట్ సూపరింటెండెంట్,అనకాపల్లి డివిజన్

నింగి నుంచి నిఘా



కాపుకాసి, దాడులు చేసి, ఛేజ్ చేసి నేరస్తుల భరతం పట్టడం పాత పద్ధతి... డ్రోన్లు ఎగరవేసి, వారి జాడ గుర్తించి ఆటకట్టించడం స్మార్ట్ పోలీసింగ్ విధానం. ఇప్పుడు జిల్లా పోలీసులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. సాంకేతిక నైపుణ్యంతో అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం **డ్రోన్లను రంగంలోకి దింపుతున్నారు.**

జిల్లాలో 32 పోలీస్‌స్టేషన్లకు డ్రోన్లు

- ఆపరేటింగ్ పై ప్రత్యేక శిక్షణ
- ప్రతి స్టేషన్‌లో డ్రోన్ కాప్స్

ఇద్దరు పోలీసులు, ఒక టెక్నీషియన్‌తో బృందం

అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు, ట్రాఫిక్ నియంత్రణకు వినియోగం

సబ్ డివిజన్ల వారీగా ఆపరేటింగ్ సిబ్బంది కేటాయింపు

సాక్షి, అనకాపల్లి: అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుశాఖ టెక్నాలజీని వినియోగిస్తోంది. నేరాలకు చెక్ పెట్టేందుకు డ్రోన్ల సాయంతో చర్యలు చేపడుతోంది. జిల్లాలో 32 పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి అనకాపల్లి జిల్లా మీదుగా గంజాయి రవాణా జరుగుతున్న నేపథ్యంలో డ్రోన్ల సాయంతో అడ్డుకట్టవేయాలని భావిస్తున్నారు. జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, మహిళలను వేధించడం, ట్రాఫిక్ సమస్య, శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల సమయంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడం, పండగ సమయాల్లో బందోబస్తు, ఇతర నిఘా కార్యకలాపాలకు ఈ డ్రోన్లను వినియోగించనున్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర రద్దీ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా పర్యవేక్షించనున్నారు. పోలీసులు భౌతికంగా వెళ్లలేని ప్రదేశాలకు వాటిని పంపి అక్కడి పరిస్థితులను సమీక్షిస్తారు. అసాంఘిక కార్యకలాపాలు, ఈవ్ టీజింగ్, ఒంటరిగా వెళ్లే మహిళలను బెదిరించడం, చోరీలకు పాల్పడటం, చైన్ స్నాచింగ్ చేస్తున్నవారిపై డ్రోన్లతో పోలీసులు చెక్ పెట్టనున్నారు. నేరాల విజువల్స్ డ్రోన్లలో సేవ్ అవుతాయి. వాటి ద్వారా త్వరితగతిన దర్యాప్తు చేయవచ్చు. ఈ డ్రోన్‌లన్నీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమై ఉంటాయి. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయితే ట్రాఫిక్ ఆగిపోవడానికి కారణం ఏమిటన్న విషయాన్ని వీటిద్వారా తేలిగ్గా తెలుసుకుంటారు. ఆ తర్వాత ఆ పరిధిలోని ట్రాఫిక్ సిబ్బందిని అప్రమత్తం చేస్తారు. అసాంఘిక కార్యకలాపాలు, నేరాల విషయంలోనూ ఇలాగే చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడుతుంది. ఈ మేరకు పరవాడ సబ్ డివిజన్ పరిధిలో గంజాయి, ఇతర నేరాల కట్టడికి కేటాయించిన డ్రోన్ కెమెరాలను ఇటీవల ఎస్పీ తుహిన్ సిన్హా ప్రారంభించారు. అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలో అనకాపల్లి టౌన్, నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలో నర్సీపట్నం టౌన్‌లో కూడా డ్రోన్లను ప్రారంభించారు.

జిల్లాలో ఇలా...

లాఅండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్లు	32
ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు	02
సెంట్రల్ క్రైం పోలీస్‌స్టేషన్	01
కేటాయించిన డ్రోన్‌లు	32
శిక్షణ పొందిన సిబ్బంది	96మంది
మొత్తం బృందాలు	32

ఒక్కో స్టేషన్‌కు : ముగ్గురితో బృందం



నర్సీపట్నం సబ్ డివిజన్‌లో డ్రోన్ కెమెరాతో తీసిన చిత్రం

ప్రత్యేక శిక్షణ

డ్రోన్ల ఆపరేటింగ్‌పై జిల్లాలో పోలీస్ సిబ్బందికి ఇటీవల వారం రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనకాపల్లి, నర్సీపట్నం, పరవాడ సబ్ డివిజన్ల నుంచి డ్రోన్ల ఆపరేటింగ్ కోసం ప్రత్యేకంగా 64 మంది పోలీసు సిబ్బందిని, 32 మంది టెక్నీషియన్లను కేటాయించారు. డ్రోన్ ఎగురవేయడమే కాకుండా.. దాన్ని ఏవిధంగా తిప్పాలి, ఏయే కోణాల్లో పంపాలి.. అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయా స్టేషన్లకు డ్రోన్‌లను అందజేశారు.

డ్రోన్లతో మరింత నిఘా..




జిల్లాను గంజాయి, మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యల్లో భాగంగా ప్రత్యేక కార్యాచరణతో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం.అందులో భాగంగా డ్రోన్ల సాయంతో నేరస్తులపై మరింత నిఘా పెంచుతాం. ప్రత్యేకించి గంజాయి రవాణాకు పాల్పడే వారు పోలీసుల నుంచి తప్పించుకున్నా..డ్రోన్ల నిఘా నుంచి తప్పించుకోలేరు. వారం రోజుల పాటు ప్రతి స్టేషన్‌కు ఒకరికి చొప్పున డ్రోన్లపై శిక్షణ అందించాం. శిక్షణ అనంతరం వారికి డ్రోన్ల అందజేశాం. పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రోన్ల ద్వారా నేరస్తులపై నిఘా పెడతాం. వీటితో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఉంచుతాం.
– తుహిన్ సిన్హా, ఎస్పీ, అనకాపల్లి

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

తుమ్మపాల: జిల్లాలో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావు నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. 16 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు నర్సీపట్నం, అనకాపల్లి డివిజన్ల నుంచి మొత్తం 3,682 మంది విద్యార్థులు హాజరయ్యారని, 208 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మొత్తం 94.6 శాతం మంది పరీక్ష రాశారని, కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు రెండు తనిఖీ బృందాలు 16 కేంద్రాలను సందర్శించినట్టు తెలిపారు.పరీక్ష కేంద్రాల్లో వైద్య సదుపాయం, బందోబస్తు ఏర్పాటుచేశామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ముగిశాయని ఆయన పేర్కొన్నారు.

వ్యవసాయ విస్తరణాధికారుల జిల్లా కార్యవర్గం ఎన్నిక



వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న నేతలు

తుమ్మపాల: వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా కార్యవర్గం ఎన్నిక ఆదివారం మండలంలోని తుమ్మపాల రైతు శిక్షణ కేంద్రంలో జరిగింది. రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం అధ్యక్షుడు డి.వి.వేణుమాధవరావు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా శ్రీకాకుళం వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు ఎరుకునాయుడు, కార్యదర్శి రమేష్ వ్యవహరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా బి.త్రివిక్రమరావు, కార్యదర్శిగా కె.వి.సూర్యనారాయణ, కోశాధికారిగా కె.సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా సి.రమణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సీహెచ్.చినదేవుడు ఎన్నియ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సుభానీ, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణాధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

జిల్లా కారాగారం ఏర్పాటుకు స్థల పరిశీలన



గొలగాంలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో షేక్ ఆయిషా, జైలు అధికారులు

తుమ్మపాల: జిల్లా కారాగారం ఏర్పాటుకు మండలంలో గోపాలపురం, గొలగాం గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా ఉప కారాగారాల అధికారి ఎస్.వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ విజయ్ కుమార్ ఆదివారం పరిశీలించారు. జిల్లాలో 10 ఎకరాల మేర ప్రభుత్వ స్థలాన్ని సేకరించేందుకు అధికారులు పలు ప్రాంతాల్లో పర్యటించారు. గోపాలపురంలో సర్వే నంబర్ 111, గొలగాంలో సర్వే నంబర్ 283 లలో ప్రభుత్వ భూములు అనువుగా, పట్టణానికి సమీపంలో ఉండడంతో జైలు అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నారు. గొలగాం సర్వే నంబర్ 283 స్థలాన్ని గతంలో కేంద్ర రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌కు కేటాయించినప్పటికి వారు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగించనుంది. ఈ కార్యక్రమంలో విశాఖ జైలర్ డి.రాజు, అనకాపల్లి సబ్‌జైల్ జైలర్ డి. కిరణ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్, మండల సర్వేయర్ మోహన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తీరంలో పారా గ్లైడింగ్





కొమ్మాది(విశాఖ): రుషికొండ బీచ్‌లో బోట్ షికార్, స్కూబా డైవింగ్ పర్యాటకులను అలరిస్తుండగా... ఇప్పుడు మరింత మధురానుభూతిని కలిగించేందుకు లివిన్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో ఆదివారం పారా గ్లైడింగ్ ట్రైల్ రన్ ప్రారంభమైంది. ఈ పారా గ్లైడింగ్‌పై విహరించడానికి ఒక్కొక్కరికి రూ.2,500 రుసుం వసూలు చేయనున్నారు. 300-500 మీటర్లు ఎత్తు వరకు ఎగురుతుందని పైలెట్ నిర్వాహకులు దినేష్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నామన్నారు.

గురుకుల విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్



మాట్లాడుతున్న రూపావతి

దేవరాపల్లి: సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన గురుకుల పాఠశాలల విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షల కోసం కోచింగ్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపావతి తెలిపారు. తెనుగుపూడి బాలుర గురుకుల విద్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షలకు సంబంధించి రాష్ట్ర స్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి, ఉత్తరాంధ్రకు చెందిన బాలురకు విశాఖ నగరంలో గల శ్రీకృష్ణాపురం గురుకుల కళాశాలలో, బాలికలకు చీపురుపల్లి బాలికల విద్యాలయంలో సీట్లు కేటాయిస్తామని చెప్పారు. వారికి ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్ష రాయడానికి అవసరమైన ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి వీలుగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

ఓవరాల్ చాంప్ కర్ణాటక ఆర్టీసీ

- సెకండ్ రన్నరప్‌గా ఏపీఎస్ఆర్టీసీ
- ముగిసిన రోడ్ రవాణా సంస్థ అథ్లెటిక్ మీట్



ఓవరాల్ చాంప్ కర్ణాటక ఆర్టీసీ



సెకండ్ రన్నరప్‌గా నిలిచిన ఏపీఎస్ ఆర్టీసీ

విశాఖ స్పోర్ట్స్ : కైలాసగిరి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న అఖిల భారత రోడ్ రవాణా సంస్థల అథ్లెటిక్ మీట్ ఆదివారం ముగిసింది. దేశంలోని 18 ఎస్టీయూలకు చెందిన క్రీడాకారులు మూడు రోజులపాటు పలు ట్రాక్ ఫీల్డ్ అంశాల్లో పోటీపడ్డారు. ముగింపు కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు హాజరై విజేతలకు ట్రోఫీలతో పాటు మెడల్స్ ప్రదానం చేశారు. పలువురు ఆర్టీసీ జాతీయ స్థాయి ఆటగాళ్లను ఈ సందర్భంగా సత్కరించారు.

త్వరలో అన్ని ఎలక్ట్రికల్ వాహనాలే..

త్వరలోనే రాష్ట్రమంతటా ఎలక్ట్రికల్ వాహనాల్నే నడిపేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. ఉద్యోగుల పదోన్నతులకు ఉన్న అడ్డంకుల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ఎండీ, రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ నిత్యం ఒత్తిడితో ఉండే రవాణా ఉద్యోగులు ఆరోగ్యం కాపాడుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. విజయనగరం జోన్ ఈడీ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయనగరం జోన్ చైర్మన్ దొన్ను దొర, ఏఎస్ఆర్టీయూ డైరెక్టర్ ఆర్ఆర్ కిషోర్, పలువురు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కర్ణాటక ఆర్టీసీ సాధించగా, బెంగళూర్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ రన్నరప్‌గా, ఏపీఎస్ఆర్టీసీ సెకండ్ రన్నరప్‌గా నిలిచాయి.

చివరి రోజు పోటీల్లో విజేతలు

జావెలిన్ త్రో మెన్‌లో 47.60 మీటర్లు విసిరి వినోద్‌కుమార్(బీఎంటీసీ), వుమెన్‌లో అంబికా నాగేష(కర్ణాటక ఎస్టీసీ) 20.07 మీటర్లు విసిరి విజేతలుగా నిలిచారు. 400 మీటర్ల మెన్ పరుగులో సచిన్ శివప్రసాద్(ఎంఎస్ఆర్టీసీ), వుమెన్‌లో రాధ(కర్ణాటక ఆర్టీసీ), 100 మీటర్ల మెన్ రిలేలో ఏపీఎస్ఆర్టీసీ, వుమెన్‌లో బీఎంటీసీ జట్లు విజేతలుగా నిలిచాయి.

నేటి నుంచి అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలు బంద్



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి 13వ తేదీ వరకు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆలయంలో జరిగే తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్రం పూజలు సందర్భంగా ఈ మార్పు చేసినట్టు పేర్కొన్నారు. పైన పేర్కొన్న తేదీల్లో సహస్ర నామార్చన, స్వర్ణపుష్పార్చన, స్వర్ణ తులసీ దళార్చన, గరుడసేవ, నిత్య కల్యాణం సేవలు రద్దు చేశామన్నారు. అలాగే ఈనెల 15న వృశ్చిక దీపారాధన సందర్భంగా ఆరోజు రాత్రి 7గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనాలు లభిస్తాయని తెలిపారు.

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

తుమ్మపాల: అనకాపల్లి పట్టణంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ఈ నెల 7న రాత్రి సమయంలో ఆటో డ్రైవర్‌పై దాడి చేసి హత్యకు ప్రయత్నించిన నిందితుడిని పట్టణ పోలీసులు పట్టుకుని కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు పంపించినట్లు పట్టణ సీఐ విజయకుమార్ ఆదివారం తెలిపారు. పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్‌ను గుర్తు తెలియని వ్యక్తి హత్యకు ప్రయత్నించడంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్సై ఈశ్వరరావు సీసీ కెమెరాలు ఆధారంగా వెరిఫై చేసి నిందితుడిని గుర్తించారన్నారు. ఈ మేరకు పట్టణంలో పూల్‌బాగ్ జంక్షన్ వద్ద గవరపాలేనికి చెందిన దాడి అరుణ్‌కుమార్‌ను పట్టుకున్నామన్నారు.

ఎన్‌ఎస్‌జీ బాక్సింగ్ కోచ్‌గా అబ్బు



నర్సీపట్నం: న్యూఢిల్లీలో ఈ నెల 9 నుంచి 15 వరకు జరగనున్న నేషనల్ స్కూల్ గేమ్స్(ఎస్‌ఎస్‌జీ) అండర్–17 బాక్సింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టు కోచ్‌గా నర్సీపట్నానికి చెందిన కె.అబ్బు నియమితులయ్యారు. కోచ్‌గా ఎంపిక చేసిన ద్రోణాచార్య అవార్డు గ్రహీత, కోచ్ ఐ.వెంకటేశ్వరరావుకు అబ్బు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అబ్బును నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్‌లు డైరెక్టర్లతో పాటు చైర్మన్ వెలగా నారాయణరావు అభినందించారు.

గోవులు తరలిస్తున్న వ్యాన్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న గోవులు

నక్కపల్లి: గోవులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను నక్కపల్లి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్‌ఐ సన్నిబాబు తెలిపిన వివరాలు ప్రకారం నక్కపల్లి నుంచి తుని వైపు 8 గోవులను వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వేంపాడు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. వ్యాన్‌లో గోవులకు మేత, తాగునీరు సదుపాయాలు కల్పించకుండా తరలిస్తున్నట్లు గుర్తించామని ఎస్‌ఐ తెలిపారు.వ్యాన్‌తో పాటు, డ్రైవర్‌ను, వాహన యజమానిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. పట్టుకున్న గోవులను గోశాలకు తరలించామని చెప్పారు.

'కొండ'ంత విశ్వాసం

- కొండగుడికి పోటెత్తిన భక్తులు
- వేడుకగా మేరీమాత ఊరేగింపు
- దివ్య పూజాబలితో ఉత్సవాల ముగింపు



సెయింట్ అలోసిస్ పాఠశాల నుంచి విశాఖ పురి మేరీమాత తేరుతో ప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్(విశాఖ): పాతపోస్టాఫీస్ ప్రాంతంలోని కొండగుడి(రోజ్‌హిల్) కొండపై కొలువైన అమలోద్భవి(విశాఖ పురి మేరీ) మాతను దర్శించుకునేందుకు అశేష భక్తజనం తరలివచ్చింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి కూడా వచ్చిన భక్తులతో విశాఖ నగరం జనసంద్రమైంది. ఆరాధకుల గీతాలాపనలు.. సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం అగ్ర పీఠాధిపతుల బోధనలతో అణువణువూ ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. కుల, మతాలకు అతీతంగా ప్రజలు తరలి వచ్చి పరమత సహనానికి ప్రతీకగా నిలిచారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ కొండల జోసెఫ్, ఫాదర్ థామస్ పుల్లాట్, సెబాస్టియన్, ప్రశాంత్ జోషి తదితరులు నేతృత్వంలో, పోలీసుల బందోబస్తులో కొండగుడి పండగ ప్రశాంతంగా సాగింది.

భక్తి శ్రద్ధలతో దివ్య పూజాబలి

గత నెల 29న ప్రారంభమైన కొండగుడి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు నవ దిన ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం ఉదయం దేవాలయం వద్ద ఆంగ్లంలో, తెలుగులో వేర్వేరుగా దివ్య పూజ జరిపారు. అధిక సంఖ్యలో కన్యలు హాజరై ప్రార్థనలు చేశారు. ఉదయం 7.30కు గుహవద్ద నల్గొండ పీఠాధిపతి కరణం ధమన్‌కుమార్ సమష్టి దివ్యబలి పూజ ప్రసంగమిచ్చారు. మధ్యాహ్నం 1.30కు సెయింట్ అలోషియస్ స్కూల్ ఆవరణలో పరిశుద్ధ జపమాల, విశాఖపురి మేరీమాత తేరుతో ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం రాజమండ్రి విచారణ కర్త దివ్యసత్ప్రసాద ఆరాధన చేశారు. 350 మంది వలంటీర్లు, 50 మంది గురువులతోపాటు, నగరంలోని వివిధ చర్చిలకు చెందిన ఫాదర్‌లు, బ్రదర్స్ పాల్గొని, కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం పాతపోస్టాఫీస్ దరి సెయింట్ అలోషియస్ స్కూల్ నుంచి అశేష ఆరాధకులు మేరీమాత స్వరూపంతో ప్రదక్షిణగా కొండపై ఉన్న ప్రధాన ఆలయానికి చేరుకున్నారు. వీరి సందర్శనార్థం ఆలయం బయట అమలోద్భవి స్వరూపాన్ని కొలువుంచారు. ఆరాధకులు అమ్మవారికి తమ శక్తి మేర బంగారం, వెండి కానుకలు సమర్పించారు. కొందరు తలనీలాలిచ్చి భక్తిని చాటుకున్నారు. లూర్దుమాత గుహ వద్ద దివ్య పూజాబలితో కొండగుడి ఉత్సవం ముగిసింది.

జోరుగా వ్యాపారం..

పాతపోస్టాఫీసు, కోటవీధి, ఫెర్రీరోడ్డు, అంబుసరంగ్ వీధి, కన్వేయర్ బెల్ట్ తదితర ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర దుకాణాలు వెలిశాయి. వీటిలో ఆధ్యాత్మిక గ్రంథాలు, కొండగుడి చరిత్ర, ఏసుక్రీస్తు, మేరీమాత బొమ్మలు కొలువుదీరాయి. మిఠాయిలు, శనగలు, ఖర్జూరం, కొవ్వొత్తుల వ్యాపారం జోరుగా సాగింది.

దివ్యాంగుల్లో మానసిక స్థైర్యం స్ఫూర్తిదాయకం



బయ్యవరం సభలో మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ రోజారాణి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కశింకోట: దివ్యాంగుల్లో మానసిక స్థైర్యం, ఆత్మ విశ్వాసం ఎంతో స్ఫూర్తిదాయకమని డ్వామా ఏపీడీ ఎం.రోజారాణి అన్నారు. మండలంలోని బయ్యవరంలో విభిన్న ప్రతిభావంతుల వేదిక, స్వామి వివేకానంద యూత్ సంయుక్త ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుల ఆశాజ్యోతులు లూయిస్ బ్రెయిలీ, హెలెన్ కెల్లర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఏపీడీ మాట్లాడుతూ దివ్యాంగులు ఈ లోకాన్ని మనసుతో చూస్తారన్నారు. ఐఈ కో–ఆర్డినేటర్ శకుంతల మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల సానుభూతితో కాకుండా సమాజంలో అందరితో సమానమైన స్థానాన్ని కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఉభయ విశాఖ జిల్లా నుంచి హాజరైన సుమారు 300 మంది దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో డీసీసీబీ మేనేజర్ ఎల్.దుర్గాప్రసాద్, విశ్వ భారతి కళాశాల ప్రిన్సిపాల్ గొన్నాబత్తుల నానాజీ, ఆదర్శ ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ దేవర చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

సంగీతం.. సాహసం

- అలరించిన తూర్పు నేవీ జాజ్ బ్యాండ్
- ఘనంగా సబ్‌మెరైన్ డే వేడుకలు



ప్రదర్శనను తిలకించేందుకు బారులు తీరిన విద్యార్థులు



జాజ్ బ్యాండ్ సంగీత విభావరి

ఏయూక్యాంపస్: సంగీతానికి సాహసాన్ని జోడించారు. సహజ సిద్ధ వాతావరణంలో తూర్పు నావికా దళం ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆకట్టుకుంది. బీచ్‌రోడ్డులోని సబ్‌మెరైన్ మ్యూజియం ప్రాంగణంలో సబ్‌మెరైన్ డే సందర్భంగా తూర్పు నావికా దళం ఏర్పాటు చేసిన జాజ్ బ్యాండ్ ప్రదర్శన ఆద్యంతం అలరించింది. ఆదివారం సెలవుదినం కావడంతో పెద్దసంఖ్యలో నగరవాసులు, పర్యాటకులు హాజరై, ఉత్సాహంగా తిలకించారు. హిందీ, ఇంగ్లిష్, తెలుగు పాటలను శ్రావ్యంగా ఆలపించి అలరించారు. భారత నావికాదళంలోకి 1967లో తొలి సబ్‌మెరైన్ ఐఎన్‌ఎస్ కల్వారి చేరిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ 57వ సబ్‌మెరైన్ డేని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సందర్శకులను భారత జలాంతర్గాములకు సంబంధించిన పలు ప్రశ్నలు అడిగారు. వారికి తెలియని ఎన్నో విషయాలను వివరించారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

సబ్‌మెరైన్ డే సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన నగరవాసులను, చిన్నారులను ఎంతగానో ఆకట్టుకుంది. పలు జలాంతర్గాములకు సంబంధించిన నమూనాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఫొటో ప్రదర్శన సైతం చిన్నారులను ఎంతగానో ఆకట్టుకుంది. జాజ్ బ్యాండ్ ఏర్పాటు చేసిన ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

తల్లీబిడ్డా క్షేమం



అంబులెన్స్‌లో అశ్విని, ఆడ శిశువు

చోడవరం రూరల్: ఆపద సమయాల్లో ఆపద్బాంధవుడిలా ప్రాణాలు నిలిపే 108 అంబులెన్స్‌లో ఓ తల్లి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో క్షతగాత్రులనే కాదు.. అత్యవసరమైతే అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవం సైతం చేస్తామని మరోసారి నిరూపించారు 108 సిబ్బంది. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పేరపు అశ్విని రెండో కాన్పులో పురిటి నొప్పులు రావడంతో ఆదివారం 108 వాహనంలో చోడవరం కమ్యూనిటీ ఆస్పత్రికి తరలిస్తున్నారు. టీచర్స్ కాలనీ వద్దకు 108 వాహనం చేరుకోగానే అశ్విని పురిటినొప్పులు భరించలేని రీతిలో ఉండడంతో వాహనంలో ఉన్న ఎమర్జెన్సీ మెడికల్ ట్రైనర్ (ఈఎంటీ) ఏడువాక అప్పలనాయుడు, వాహన పైలెట్ గణేష్ అంబులెన్స్‌ను రోడ్డు పక్కన ఆపి, ఆమెకు ప్రసవం ఏర్పాట్లు చేశారు. కొద్ది సేపట్లో ఆమె పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం క్షేమంగా ఉన్న తల్లీబిడ్డను చోడవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అశ్విని, ఆమె భర్త సాయిబాబు, వైద్య సిబ్బంది అంబులెన్స్ సిబ్బందిని అభినందించారు.

'సరుగుడు' వద్ద సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు జలకాలు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులు ఆటపాటలతో సందడి చేశారు. అనకాపల్లి, కాకినాడ జిల్లాల నలుమూలలు నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చి, జలపాతంలో తనివి తీరా జలకాలు ఆడారు. తాండవ రిజర్వాయర్ ప్రాంతంలో సందర్శకులు సందడి కనిపించింది, అధిక సంఖ్యలో వాహనాలపై తరలి రావడంతో సరుగుడు జలపాతానికి వెళ్లే రోడ్డు, నాతవరం నుంచి తాండవ ప్రాజెక్టు వెళ్లే రోడ్డులో వాహనాలు రద్దీ ఏర్పడింది.

ఢీకొన్న రెండు బండరాళ్ల లోడు లారీలు

- కారును తప్పించబోయి లారీ బోల్తా
- ఆ వెనక వస్తున్న మరో లారీ ఢీకొన్న వైనం
- సోమన్నపాలెం వద్ద ఘటన



ప్రమాదంలో గాయపడిన డ్రైవర్



సోమన్నపాలెం వద్ద ఢీకొన్న బండరాళ్ల లారీలు

యలమంచిలి: యలమంచిలి మండలం సోమన్నపాలెం గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం పాత జాతీయ రహదారిపై రెండు బండరాళ్లను తరలిస్తున్న లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. యలమంచిలి రూరల్ ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రోలుగుంట మండలం నుంచి రాంబిల్లి నేవీ ప్రాజెక్టుకు నల్ల బండరాళ్లను తరలిస్తున్న రెండు లారీలు ఒక దాని వెంట ఒకటి వస్తున్నాయి. యలమంచిలి మండలం మర్రిబంధ శివారు సోమన్నపాలెం గ్రామం సమీపంలోకి వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీకి.. కారు ఆకస్మికంగా అడ్డు రావడంతో లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో లారీ ఒక్కసారిగా బోల్తాపడింది. ఇంతలో వెనుక వస్తున్న మరో బండరాళ్ల లారీ ముందు లారీని ఢీకొట్టి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో వెనక లారీలో ఉన్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పాత జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ ఉపేంద్ర సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గాయపడిన డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్విమ్మింగ్ ఓవరాల్ చాంప్ ఎన్టీఆర్ జిల్లా

- రన్నరప్‌గా విశాఖ జిల్లా
- శరత్, పావని వ్యక్తిగత చాంప్‌లు
- ముగిసిన ఏపీ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఎన్టీఆర్ జిల్లా సాధించగా విశాఖ జిల్లా రన్నరప్‌గా నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు 24 స్వర్ణాలు, 22 రజతాలు, 13 కాంస్య పతకాలతో 199 పాయింట్లు సాధించగా, విశాఖ స్విమ్మర్లు 8 స్వర్ణాలు, 13 రజతాలు, 16 కాంస్యాలతో 95 పాయింట్లు దక్కించుకున్నారు.

- గ్రూప్–3 కేటగిరీ బాలుర విభాగంలో స్వామినాయుడు(ఏలూరు), త్రిభువనరెడ్డి(కడప) 23 పాయింట్లతో సముజ్జీగా నిలిచి వ్యక్తిగత చాంపియన్‌షిప్ పంచుకున్నారు. బాలికల్లో పార్థవి(కృష్ణా) 25 పాయింట్లతో వ్యక్తిగత చాంపియన్‌షిప్ సాధించింది.
- గ్రూప్–2 కేటగిరీ బాలుర విభాగంలో కార్తీకేయ దేవ(కడప), బాలికల్లో అవిఘ్న(బాపట్ల) చెరో 25 పాయింట్లతో వ్యక్తిగత చాంపియన్‌షిప్ సాధించారు.
- గ్రూప్–1 కేటగిరీ బాలురలో శరత్, బాలికల్లో పావని, ప్రేమామృత సంయుక్తంగా వ్యక్తిగత చాంపియన్‌షిప్ అందుకున్నారు. వీరంతా ఎన్టీఆర్ జిల్లా నుంచి పోటీల్లో పాల్గొన్నారు.

విశాఖ సాగరతీరంలోని అక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో మూడు ఏజ్ గ్రూప్‌ల్లో జరిగిన పోటీలు ఆదివారంతో ముగిశాయి. జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో వాటర్ పోలోతో సహా 45 అంశాల్లో పోటీలు నిర్వహించారు. స్విమ్మర్లు ఆయా అంశంలో సాధించిన రికార్డు ఆధారంగా రాష్ట్ర జట్లను ఎంపిక చేయనున్నట్లు సంఘం కార్యదర్శి మోహన్‌రామ్ తెలిపారు.

వెనుకబడిన జంగమ కుటుంబాలను ఆదుకోవాలి

సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మారుతీ నాగలింగం



బొజ్జన్నకొండ వద్ద సమావేశమైన జంగమ కులస్తులు

తుమ్మపాల: ఆర్థికంగా వెనుకబడిన జంగమ కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉ.మారుతీ నాగలింగం కోరారు. ఆదివారం అనకాపల్లి మండలం శంకరంలో బొజ్జన్నకొండ వద్ద సంఘ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగమ కులస్తులకు ప్రభుత్వం ఆర్థిక, ఉపాధి, ఉద్యోగ భరోసా కల్పించాలన్నారు. పలు రకాల ప్రోత్సాహకాలు అందించి సబ్సిడీ రుణాలతో వ్యాపార, వృత్తుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పూడి ఈశ్వరరావు, కార్యదర్శి పతివాడ మూర్తి, క్యాషియర్ నంది కాశీ, వర్కింగ్ ప్రెసిడెంట్ అత్తిలి ఈశ్వరరావు, జంగమ సంఘాల నాయకులు, సభ్యులు, కులస్తులు పాల్గొన్నారు.

'విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయండి'



హైకోర్టు న్యాయమూర్తులతో విశాఖ బార్ అసోసియేషన్ ప్రతినిధులు

విశాఖ లీగల్: అన్ని రంగాల్లో శరవేగంగా వృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో హైకోర్టు బెంచ్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్‌తో కలిసి విశాఖలో ఆదివారం పలువురు హైకోర్టు న్యాయమూర్తులను కలిశారు. వారికి హైకోర్టు ఏర్పాటు ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా, అంతర్జాతీయ విమాన కేంద్రంగా, పారిశ్రామిక నగరంగా అభివృద్ధి చెందుతున్న విశాఖకు హైకోర్టు బెంచ్ ఆవశ్యకత ఉందన్నారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్ రఘునందన్ రావు, జస్టిస్ కె.శ్రీనివాస్ రెడ్డి, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ ఎం.జై సూర్యలను మర్యాదపూర్వకంగా కలిసి, వినతి పత్రాలు అందించారు. వీరి వెంట విశాఖ న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు ఇమంది శ్రీనివాసరావు, కార్యదర్శి డి.నరేష్ తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణ మోదీ, చంద్రబాబుల కుట్ర

- మాల జాతీయ నేతల స్పష్టీకరణ
- మార్మోగిన ఉత్తరాంధ్ర మాలల గర్జన



మాట్లాడుతున్న హర్షకుమార్

బీచ్‌రోడ్డు(విశాఖ): ఎస్సీ వర్గీకరణ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలో భాగమేనని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు అన్నారు. పట్టణంలోని గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఉత్తరాంధ్ర మాలల గర్జనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల త్యాగాల బాట నుంచి రేపటి పిల్లల భవిష్యత్తు కోసం మాలలంతా ఐక్యంగా నిలిచి, వర్గీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం ఎస్సీల మధ్య చిచ్చురేపి వర్గీకరణ అంశంతో ఆటలాడుకుంటున్నారని, వారికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. గర్జన కన్వీనర్ పతివాడ రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గోపీనాథ్, ఏయూ ప్రొఫెసర్ ఎస్‌ఏడీ పాల్, ఎస్‌ఎన్ మూర్తి, నూకతోటి బాబూరావు, పాల్తేటి పెంటారావు, కంత వేణు, గంటాన అప్పారావు, పిరుబండి జయంతి కుమార్, పెదపాటి మేఘరంజన్, ఎం.చంద్రశేఖర్, బూసి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి ఉదయభాస్కర్ బృందం, జన చైతన్య కళాబృందం ఆలపించిన చైతన్య గీతాలు సభికులను ఆకట్టుకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రామచంద్రరావు (ఫైల్)

నర్సీపట్నం: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ మెయిన్‌రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించాడు. రామారావు పేటకు చెందిన గంగుబోగుల రామచంద్రరావు(58) తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చి ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈఘటనలో రామచంద్రరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

300 లీటర్ల సారా పులుపు ధ్వంసం



సారా పులుపు ధ్వంసం చేస్తున్న పోలీసులు

గొలుగొండ: చోద్యం గ్రామ పరిధిలోని బొడ్డేరు గెడ్డ సమీపంలో నాటుసారా తయారీకి ఉపయోగించే 300 లీటర్ల పులుపును కృష్ణదేవిపేట ఎస్‌ఐ తారకేశ్వరావు ఆధ్వర్యంలో ఆదివారం ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారంతో సారా తయారీకి పులుపు నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారంతో దాడి చేశామన్నారు. సారా తయారీ, అమ్మకాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.4 లక్షల విరాళం



సూపరింటిండెంట్ విక్రమ్‌కు చెక్కులు అందజేస్తున్న దాతలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం రూ.4 లక్షల విరాళాన్ని నలుగురు దాతలు అందజేశారు. నగరంలోని ఆటోనగర్‌కు చెందిన ప్రభల వెంకట భాస్కర సుబ్బారావు, ప్రబల వెంకట శేష ఆదిత్య కౌశిక్, ప్రభల వెంకట సుబ్బలక్ష్మి, మంగిపూడి ఉష రూ.లక్ష చొప్పున అందజేశారు. సంబంధిత చెక్కులను సింహగిరిపై ప్రోటోకాల్ సూపరింటిండెంట్ విక్రమ్‌కు అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.

వైభవం.. గిరిజన సమ్మేళనం



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కొమ్మాది : జాతీయ గిరిజన యువ సమ్మేళనంలో రెండో రోజు సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సాహంగా సాగాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల యువతీయువకుల నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో గీతంలో జరుగుతున్న 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనంలో ఆదివారం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఆదివాసీ విద్యార్థులు చక్కటి ప్రదర్శనలతో అందరిని మైమరిపించాయి. అనంతరం జాతి నిర్మాణంలో దేశభక్తి అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

'బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి'



కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలుపుతున్న నగరవాసులు

ఏయూ క్యాంపస్: బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని నగరవాసులు నినదించారు. ఆ దేశంలో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బీచ్‌రోడ్డులోని అన్నమయ్య విగ్రహం వద్ద రాధారంగ రాయల్ అసోసియేషన్, అక్కడి హిందువులకు సంఘీభావంగా కొవ్వొత్తులు వెలిగించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గాది బాలాజీ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో అన్యాయంగా అరెస్టు చేసిన ఇస్కాన్ స్వామీజీ చిన్మయ కృష్ణదాస్‌ను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. న్యాయ స్థానంలో బెయిల్ రాకుండా అడ్డుకుంటూ అరాచకం చేస్తున్నారని ఆరోపించారు. ఇది హిందువులపై జరుగుతున్న దాడిగానే ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. భారత ప్రభుత్వం చొరవ తీసుకుని చిన్మయ దాస్‌ని విడుదల చేయించేటా చూడాలన్నారు. కార్యక్రమంలో తెలగపూడి శ్రీనివాసరావు, మహేంద్ర, గోవింద, శివకుమార్, కోటేశ్వరరావు, ఏడిద భార్గవ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తుమ్మపాల వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ పురస్కారం



ఉత్తమ క్లబ్‌గా అవార్డు అందుకుంటున్న అధ్యక్షుడు సత్యనారాయణ

తుమ్మపాల: స్థానిక వాకర్స్ క్లబ్ అనేక నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఉత్తమ పురస్కారానికి ఎంపికైందని సంబంధిత అధ్యక్షుడు ఎరుబండి సత్యనారాయణ తెలిపారు. సింహాచలం శ్రీ గౌరి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 101 కాన్ఫరెన్స్ సమావేశంలో క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ మురళీ మనోహర్, డిస్ట్రిక్ట్ గవర్నర్ టి.రంగారావుల నుంచి అవార్డు అందుకున్నామన్నారు. గడిచిన ఆరు నెలల్లోనే రెండు ఉచిత కంటి వైద్య శిబిరాలు, మెడికల్ అవేర్నెస్ క్యాంపులు పెట్టామన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు సుంకర రవీంద్ర, డాక్టర్ డి.డి. నాయుడు, అన్ని క్లబ్‌ల నుంచి పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

26 మద్యం బాటిళ్లతో మహిళ అరెస్ట్



మద్యం బాటిళ్లతో పట్టుబడిన మహిళతో పోలీసులు

మునగపాక(అచ్యుతాపురం): మునగపాక మండలంలోని నాగులాపల్లి రైస్ మిల్లు వద్ద అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఓ మహిళను ఆదివారం అరెస్ట్ చేసినట్టు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వై.ఎల్.నాయుడు తెలిపారు. ఆమె వద్ద నుంచి 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో కె. గణేష్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

మాడుగుల రూరల్ : నీటి సంఘాలు ఎన్నికలు ఈ నెల 14వ తేదీన నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్టు మండల ఇరిగేషన్ జేఈ భార్గవ్‌కుమార్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనల్లో పేర్కొన్నారు. మండలంలో 8 మధ్య తరహా, 14 చిన్నతరహా నీటి సంఘాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు గ్రామాల్లో సంఘాలు ఓటర్ల జాబితాలు విడుదల చేశామన్నారు. మధ్య తరహా నీటి సంఘానికి సంబంధించి 12 మంది డైరెక్టర్లు, చిన్నతరహా నీటి సంఘానికి సంబంధించి ఆరుగురు డైరెక్టర్లు ఉంటారని, వీరి నుంచి ఒకరు అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను మిగిలిన డైరెక్టర్లు ఎన్నికుంటారని జేఈ భార్గవ్‌కుమార్ తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-2
పుష్ప-2	:పర్తిసాయి
పుష్ప-2	:షిర్డీసాయి
పుష్ప-2	:వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	:శ్రీసత్య
పుష్ప-2	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 46 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7, బీ పాజిటివ్-10, ఓ పాజిటివ్-28, ఏబీ పాజిటివ్-1 యూనిట్ చొప్పున శుద్ధి చేసిన రక్తం అందుబాటులో ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్‌ను 97036 19706 నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 339 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 305 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

ప్రయాణమెలా?

- అధ్వానంగా బుచ్చియ్యపేట-అమీన్‌సాహెబ్‌పేట రోడ్డు
- రాళ్లు తేలడంతో వాహనదారుల ఒళ్లు హూనం
- మరమ్మతులకు గురవుతున్న వాహనాలు



బురదమయంగా ఉన్న రోడ్డు



అధ్వానంగా బుచ్చియ్యపేట-అమీన్‌సాహెబ్‌పేట రోడ్డు

ఇటీవల వర్షాలకు రోడ్లు దారుణంగా తయారయ్యాయి. కొన్నిచోట్ల గోతులమయమై.. మరి కొన్నిచోట్ల రాళ్లు తేలి అధ్వానంగా మారాయి. వీటిపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారుల ఒళ్లు హూనమై ప్రయాణమంటే బెంబేలెత్తుతున్నారు. తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. ఇదే దుస్థితి బుచ్చియ్యపేట-అమీన్‌సాహెబ్‌పేట గ్రామాల మధ్య రోడ్డుపై ప్రయాణించే వారికి తప్పడం లేదు.



రాళ్లు తేలి ఉన్న రోడ్డు

కశింకోట: మండలంలోని బుచ్చియ్యపేట-అమీన్‌సాహెబ్‌పేట గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా ఉంది. రాళ్లు తేలి, బురదమయంగా మారి గోతులతో నిండి ఉంది. దీంతో రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు, ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రంగబోలు గెడ్డ కాలువను అనుకొని బుచ్చియ్యపేట నుంచి ఏఎస్ పేట వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర పొడవున మట్టి రోడ్డు ఉండేది. బుచ్చియ్యపేట, ఏఎస్ పేట గ్రామాలతోపాటు కొత్తపల్లి, నరసాపురం, సోమవరం, గణపర్తి, తదితర గ్రామాల ప్రజలకు దగ్గరి దారిగా ఉపయోగపడుతోంది. జాతీయ రహదారి మీదుగా వెళ్తే ఆరేడు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి ఉంటుంది. దీన్ని మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2007లో పంచాయతీరాజ్ శాఖ తరపున రూ.30 లక్షలు ఖర్చు చేసి మెటల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలకు అనువుగా మారింది. బుచ్చియ్యపేట, ఏఎస్‌పేట గ్రామాలకు చెందిన రైతుల పొలాలు, పశువుల పాకలు ఈ రోడ్డును ఆనుకుని ఉన్నాయి. దీంతో వారు తమ పొలాల్లో కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి, పశువుల సంరక్షణ, పాలు సేకరణకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆయితే కాలక్రమంలో వర్షాలకు మెటల్ రోడ్డు దెబ్బతిని పలుచోట్ల రాళ్లు తేలింది. కొన్నిచోట్ల మట్టి రోడ్డును తలపిస్తోంది. వర్షం వస్తే ఇది మరింత అధ్వానంగా ఉంటోంది. పలుచోట్ల గోతులు కూడా పడ్డాయి. దీంతో వాహన చోదకులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు గోతుల్లో పడి, తేలిన రాళ్లపై రాకపోకలు సాగించడంతో మరమ్మతులకు గురవుతున్నాయని, ఒక్కొక్కసారి అదుపు తప్పి కింద పడి ప్రమాదాలకు గురికావలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఒళ్లు హూనమవుతోందని వాపోతున్నారు. రెండు వైపులా తుప్పలు ఏపుగా పెరిగి ఉండటం వల్ల విష పురుగులు, పాముల వల్ల ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. దీని దృష్ట్యా సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు, వాహన చోదకులు చాలా కాలంగా కోరుతున్నారు. ఇంత వరకూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. దీంతో తాము నిత్యం ఇబ్బందులకు గురికావలసి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు నిధులు మంజూరు చేసి సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిత్యం నరకయాతన



బుచ్చియ్యపేట-ఏఎస్ పేట మధ్య మెటల్ రోడ్డు దెబ్బతిని అధ్వానంగా ఉంది. దీంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. మా పొలాలు, పశుశాలలు ఈ మార్గంలోనే ఉన్నాయి. నిత్యం రాకపోకలు సాగిస్తూ వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించుకుంటాం. రోడ్డు బాగోకపోవడం వల్ల నిత్యం నరకయాతన అనుభవిస్తున్నాం. రోడ్డును సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేయాలి.

-పచ్చికూర నూకరాజు, రైతు, బుచ్చియ్యపేట

మా ఇబ్బందులను తొలగించాలి



బుచ్చియ్యపేట-ఏఎస్ పేట మెటల్ రోడ్డు గోతులమయంగా ఉంది. రాళ్లు తేలి ఉన్నాయి. దీంతో రాకపోకలు సాగించడం కష్టంగా ఉంది. మా పొలాలకు వెళ్లడానికి ఇదే రహదారి. మరో మార్గం లేదు. దీన్ని సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసి మా ఇబ్బందులను తొలగించాలి.

-సుందరపు సత్తిబాబు, రైతు, బుచ్చియ్యపేట

వాహనాలు దెబ్బతింటున్నాయి



బుచ్చియ్యపేట-నరసాపురం రోడ్డు గోతులతో నిండి ఉండటం, రాళ్లు తేలి ఉండటం వల్ల మా వాహనాలు దెబ్బతింటున్నాయి. ఒక్కొక్కసారి ప్రమాదాలకు కూడా గురికావలసి వస్తోంది. ఇది ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించడానికి దగ్గరి దారి. సత్వరమే దెబ్బతిన్న రోడ్డు స్థానంలో సిమెంట్ రోడ్డు నిర్మించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

-పి. గణేష్, విద్యార్థి, బుచ్చియ్యపేట

సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు

బుచ్చియ్యపేట-ఏఎస్ పేట రోడ్డును సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటాం. రూ.కోటిన్నర పైగా ఖర్చు అవుతుంది. పూర్తి స్థాయిలో అంచనాలు తయారు చేసి ఉపాధి పథకంలో చేపట్టడానికి వచ్చే బడ్జెట్‌లో నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదించడానికి చర్యలు తీసుకుంటాం.

-డి.వేణుగోపాలరావు, పంచాయతీరాజ్, డీఈఈ, అనకాపల్లి

సీపీఐకి విరాళాలు ఇవ్వండి

తుమ్మపాల: ప్రజా పోరాటాల నిర్వహించే సీపీఐకి విరాళాలు ఇచ్చి సహకరించాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం తుమ్మపాల మేజర్ పంచాయతీలో సీపీఐ నాయకులు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాల నిర్వహించే సీపీఐ బలోపేతానికి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ఈ నెల 25వ తేదీ నాటికి వందో సంవత్సరంలో అడుగు పెడుతున్న సీపీఐ పోరాట చరిత్రను ప్రజలకు వివరిస్తూ విరాళాలు సేకరిస్తున్నామన్నారు. నిరంతరం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కార్మిక వర్గ ప్రయోజనాల రక్షణ కోసం పనిచేస్తున్న సీపీఐ ఉద్యమ నిర్మాణానికి ప్రజల మద్దతు అవసరమన్నారు. సీపీఐ అగ్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే కోడిగంటి గోవిందరావు ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.ఎస్ సన్యాసిరావు, దేవుడుబాబు, ఫణీంద్రకుమార్, వీరాచారి, కె.త్రినాథ్, పప్పల ఈశ్వరరావు, సత్యనారాయణ, డొక్కరి హరీష్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రాంబిల్లి(యలమంచిలి): చోరీ కేసులో నిందితుడిని రాంబిల్లి పోలీసులు ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేశారు. రాంబిల్లి సీఐ సిహెచ్.నర్సింగరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంబిల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కె.నాగేశ్వరరావు ఇంట్లో ఈ నెల 1న బంగారం చోరీకు గురైనట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. యలమంచిలిలో ఉంటున్న పతివాడ గణేష్ అనే వ్యక్తి ఈ చోరీకి పాల్పడినట్టు దర్యాప్తులో తేలింది. నిందితుడి నుంచి చోరీకి గురైన బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గణేష్ గతంలో చాలా చోరీ కేసుల్లో పట్టుబడినట్లు రాంబిల్లి సీఐ తెలిపారు.

జాతీయ ప్రచార కమిటీ అధ్యక్షుడిగా రాంబాబు

నక్కపల్లి: అఖిల భారత భవానీ దీక్షా చారిటబుల్ ట్రస్ట్ జాతీయ కమిటీలో ఉపమాకకు చెందిన గురు భవానీ దవరసింగు రాంబాబుకు చోటలభించింది. ఆదివారం విజయవాడలో జరిగిన ట్రస్ట్ జాతీయ కమిటీ సమావేశంలో రాంబాబును ట్రస్ట్ జాతీయ ప్రచార కమిటీ అధ్యక్షుడిగా నియమిస్తున్నట్టు ట్రస్ట్ జాతీయ అధ్యక్షుడు లంకా గణేష్ ప్రకటించారు. గతంలో తాను ప్రచార కమిటీ కార్యదర్శిగా పని చేశానని రాంబాబు తెలిపారు. ఆయన నియామకంపై భవానీ భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి కృషి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

కశింకోట: రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తెలిపారు. ఆదివారం అనకాపల్లిలో మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగుల జీతాలు, పదవీ విరమణ చేసిన వారికి పింఛన్లు అందజేస్తుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల బకాయిలను దశల వారీగా చెల్లించడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. 117 జీవో రద్దుకు చర్యలు ప్రారంభించిందన్నారు. ఇతర సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టిందన్నారు. దీనివల్ల ఉపాధ్యాయుల సమస్యలన్ని పరిష్కారం కాగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలికి ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఓటర్లుగా అర్హులంతా నమోదు చేసుకోవాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికి దుర్గాప్రసాద్, కార్యదర్శి దేముడు బాబు, పట్టణ శాఖ అధ్యక్షుడు కొణతాల గణేష్, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ, కార్యదర్శి నక్కా శ్రీనుబాబు, రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 19, 20, 21 తేదీల్లో మచిలీపట్నంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన జి.గౌతమ్, జి.హర్షిత, ఎ.హర్షిత బంగారు పతకాలు సాధించారు. ఈ ముగ్గురూ సోమవారం ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి తెలిపారు. విజేతలను, కోచ్‌లు అమర్‌నాథ్, అన్నపూర్ణలను పాఠశాల సీఈవో కె.నిశాంత్ అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

శానిటేషన్ కార్మికురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఏపీ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి

తుమ్మపాల: ఎస్. రాయవరం మండలం కొరుప్రోలు గ్రామానికి చెందిన శానిటేషన్ కార్మికురాలు ఏడిద కుమారి (40) కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని ఏపీ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.శివలక్ష్మి, పి.జానకి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావుతో కలిసి వారు మాట్లాడారు. శుక్రవారం ప్రాథమిక పాఠశాలలో కుమారి మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందారని వాపోయారు. శానిటేషన్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడం, ప్రమాదవశాత్తు మృతి చెందినా ఇన్సూరెన్స్ లేకపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. ఇప్పటికే శానిటేషన్ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే బకాయి జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ వంటి సౌకర్యాలు వెంటనే కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, లక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

దేవస్థానం ఫొటోగ్రాఫర్‌కు ఈవో అభినందనలు



అవార్డు పొందిన ఫొటోగ్రాఫ్, ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్‌తో ఈవో త్రినాథరావు

సింహాచలం: ఫొటోగ్రఫీలో ఉత్తమ పురస్కారం అందుకున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఫొటోగ్రాఫర్ తెంటు శ్రీనివాస్‌ను సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అభినందించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గత నెల 30న 132వ ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా మరియు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్వవిద్యాలయం పాత్రికేయ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా తెంటు శ్రీనివాస్ తీసిన అప్పన్న ఆలయంలోని భూవరాహస్వామి ఫొటో శ్రీ రాజ దీన్‌దయాళ్ మెమోరియల్ అవార్డు గెలుచుకుంది. అక్కడ తెంటు శ్రీనివాస్ అవార్డు తీసుకున్నారు. అవార్డు గ్రహీత శ్రీనివాస్‌ను ఈవో త్రినాథరావు ఆదివారం ఆలయంలో దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు

నక్కపల్లి: జాతీయ రహదారిపై కాగిత సమీపంలో ఆదివారం ఓ కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. అదృష్టవశాత్తూ కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విశాఖకు చెందిన ఓ కుటుంబం కారులో అన్నవరం బయలు దేరింది. వారు ప్రయాణిస్తున్న కారుకు ఆవు అడ్డు రావడంతో అదుపు తప్పి ఢీకొట్టింది. ఆవు కారుపై పడటంతో ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు మినహా మిగతా వారికి గాయాలు కాలేదు.

గవర కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తా

రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర



గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రకు సత్కారం

కశింకోట: గవర కులస్తుల సంక్షేమానికి, అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తానని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలోని సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద బీఆర్‌టీ కాలనీకి చెందిన గౌరీ సంఘం ఆధ్వర్యంలో గవర కులస్తుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. గౌరీ మాతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అత్యున్నత స్థానాలకు చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందేలా తన సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. బీఆర్‌టీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి తన వంతు విరాళంగా రూ.25 వేలు ప్రకటించారు. అనంతరం సురేంద్రకు పూలమాల వేసి దుశ్శాలువా కప్పి జ్ఞాపికతో సంఘం తరపున సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ భీశెట్టి సత్యవతి, అనకాపల్లి గౌరీ సంఘం అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్లు విల్లూరి హరి, బొడ్డేడ శ్రీను, మళ్ల సురేష్, గౌరీ సంఘం ప్రతినిధులు మళ్ల శ్రీనివాస్, మొల్లేటి శివాజీ, యల్లపు వెంకటరావు, బుద్ధ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలకు స్వచ్ఛంద బీమా అమలు



కిరణ్మయి

కె.కోటపాడు : మామిడితోటలకు సంబంధించి 2024-25 కాలానికి స్వచ్ఛంద బీమా పథకం అమలులో ఉన్నట్టు ఉద్యానవనశాఖాధికారి కిరణ్మయి ఒక ప్రకటనలో తెలిపారు. బీమాలో ఉన్న మామిడి తోటలకు వాతావరణ ఆధారితం అనగా అకాల వర్షాలు, వాతావరణంలో తేమ శాతం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటకు నష్టం కలిగినట్టు గుర్తిస్తే సంబంధిత రైతులకు బీమా నగదు అందుతుందని తెలిపారు. ఈ బీమాలో చేరేందుకు ఎకరానికి రైతులు రూ.2200 అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ పేరిట చెల్లించాలన్నారు. తోటలకు నష్టం కలిగే పరిస్థితుల్లో బీమా కింద ఎకరానికి రూ.44వేల నగదును అందుతుందని తెలిపారు. ఆధార్‌కార్డు, భూమి పత్రాలు, పంట సాగు ధ్రువీకరణపత్రం, బ్యాంక్ పాస్ పుస్తకం, ఫోన్ నంబర్లతో నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో మామిడి పంటకు బీమా పథకంలో చేరవచ్చునని ఆమె తెలిపారు. సాగు రైతులు ఈ నెలలోగా చేరాలని ఆమె సూచించారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



స్వర్ణ పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగ దళాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు అందించారు.

23 ఏళ్ల తరువాత కలిశారు..

దేవరాపల్లి: మండలంలో తెనుగుపూడి బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ గురుకుల పాఠశాలలో 2000-2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 23 సంవత్సరాలు తర్వాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వారు వివిధ వృత్తి, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎస్.రూపావతి, పాల్గొన్నారు.



తెనుగుపూడి గురుకుల పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మండలంలో కూలీల కొరత



వరి పొలంలో కోత పనులు

రోలుగుంట : మండలంలో కూలీల కొరత ఏర్పడింది. వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వరి పొలాలు ఒకేసారి పండడంతో రైతులు కోతల పనుల్లో నిమగ్నమయ్యారు. రెండు రోజులుగా ఎండలు కాయడం, వాతావరణం అనుకూలంగా ఉండడంతో మండలంలో వరి కోతలు చేపట్టారు. దీంతో కూలీలకొరత ఏర్పడి, రోలుగుంట, కొండపాలెం, కంచుగుమల తదితర గ్రామాల్లో కూలీలు దొరకక కుటుంబ సభ్యులే కోతల పనుల్లో పాల్గొంటున్నారు. ఆదివారం మండలంలో రైతు నాయకుల సమాచారం మేరకు సుమారు 1200 ఎకరాల్లో వరికోతలు జరిగాయి.